# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ప్రపంచ అస్థిరతల మధ్య కూడా భారత్ పటిష్టమైన ఎగుమతుల వృద్ధిని కొనసాగిస్తోందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- ❖ ప్రజాభిప్రాయ సేకరణ కోసం విబి-జి-రామ్-జి చట్టం-2025 ముసాయిదా నిబంధనలను ప్రభుత్వం విడుదల చేసింది.
- ❖ లక్నో వేదికగా పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31న ప్రసారమవుతుంది.

===================

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, వారి నైపుణ్యాలకు అనుగుణంగా అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. దేశ వ్యాప్తంగా యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “రోజ్‌గార్ మేళా” 19వ విడతలో భాగంగా ప్రధానమంత్రి ఈరోజు 51 వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. దేశ వ్యాప్తంగా 47 కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులు రైల్వే, హోం వ్యవహారాలు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఉన్నత విద్య, ఆర్థిక సేవల వంటి కీలక కేంద్ర ప్రభుత్వ శాఖల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ… యువత ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశ యువతకు అవకాశాలు, ఉపాధి, ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించేందుకు భారత్ వివిధ దేశాలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటోందని ఆయన తెలిపారు. 2047 నాటికి దేశాన్ని “వికసిత్ భారత్”గా తీర్చిదిద్దాలనే నిబద్ధతతో ప్రతి భారతీయుడు పని చేస్తున్నాడని తెలిపారు. పౌరుల జీవితాలను మెరుగుపరచడానికి, సులభతరం చేయడానికి ప్రభుత్వ ఉద్యోగాలు ఒక కీలకమైన సాధనంగా పని చేస్తాయని ప్రధానమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసికట్టుగా పని చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ప్రధానమంత్రిని ఈరోజు ఢిల్లీలో కలిశారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధిస్తున్న పురోగతి, ప్రపంచ శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రక్షణ, వ్యూహాత్మక సాంకేతికతలు, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, అనుసంధానం, విద్య, ప్రజల మధ్య సంబంధాలతో సహా పలు రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన నిరంతర పురోగతి గురించి మార్కో రూబియో నరేంద్ర మోదీకి వివరించారని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు భారతదేశం మద్దతును, చర్చలు, దౌత్యం ద్వారా సంఘర్షణలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్న పిలుపును ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. కాగా మార్కో రూబియో ఈ నెల 26న జరిగే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఈరోజు భార త్ కు వచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రజాభిప్రాయ సేకరణ కోసం విబి-జి రామ్ జి చట్టం-2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఈరోజు విడుదల చేసింది. ఈ ముసాయిదా నిబంధనలపై ఎవరైనా తమ అభ్యంతరాలను లేదా సూచనలను వచ్చే నెల 21వ తేదీలోగా పరిశీలన కోసం సమర్పించవచ్చని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం... 20 ఏళ్ల నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005 స్థానంలో వచ్చింది. ఈ కొత్త చట్టం ఒక ఆర్థిక సంవత్సరంలో చట్టబద్ధమైన ఉపాధి హామీని 100 రోజుల నుండి 125 రోజులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. చట్టంలోని సెక్షన్ 33, ఇతర సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ముసాయిదా నియమాలను రూపొందించినట్లు ఆ శాఖ పేర్కొంది. ఈ ఏడాది జూలై 1 నుండి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమలులోకి వచ్చేలా... వి.బి. జి రామ్ జి చట్టం-2025ను ఈ నెల 11వ తేదీన నోటిఫై చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్‌లోని దండేవాళా క్షేత్రంలో చమురు పరిశ్రమ కొత్త గ్యాస్ నిక్షేపాలను కనుగొందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. భూమికి దగ్గరగా ఉండే సాను ఫార్మేషన్ నుండి మొదటిసారిగా రోజుకు దాదాపు 25 వేల ప్రామాణిక క్యూబిక్ మీటర్ల సహజ వాయువు ఉత్పత్తి కావడం ఒక ముఖ్యమైన విజయమని ఈరోజు సామాజిక మాధ్యమంలో చేసిన పోస్టులో కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇది దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుందని, అలాగే ఇంధన స్వయం సమృద్ధి దిశగా భారతదేశ ప్రయాణానికి ఊతమిస్తుందని ఆయన తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ అస్థిరతల మధ్య భారతదేశం బలమైన ఆర్థిక పునాదులను, పటిష్టమైన ఎగుమతుల వృద్ధిని కొనసాగిస్తోందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఏప్రిల్ లో నమోదైన ఎగుమతుల వృద్ధి వేగం మే నెలలో కూడా కొనసాగిందని, ఇది ప్రపంచ ప్రతికూలతల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తోందన్నారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చుల నుండి రైతులను రక్షించడానికి, పెరిగిన ఎరువుల ధరల భారాన్ని ప్రభుత్వమే భరించిందని పేర్కొన్నారు. భవ్య పథకం ద్వారా ప్రభుత్వం మరో వ్యాపార సౌలభ్యం కల్పించే చర్యను కూడా ప్రారంభిస్తోందని, దీని కింద దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 33,600 కోట్లకు పైగా కేటాయింపులతో భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన కింద ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నామని పీయూష్ గోయల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ-2026 పరీక్షకు సంబంధించిన ఫీజు రీఫండ్ కోసం ఎన్‌టీఏ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది. విద్యార్థులు neet.nta.nic.in అధికారిక వెబ్‌సైట్ ద్వారా రీఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంక్ ఖాతా వివరాలు సమర్పించడానికి ఈ నెల 27 చివరి తేదీగా నిర్ణయించారు. అభ్యర్థులు నీట్ పోర్టల్‌లో లాగిన్ అయ్యి రీఫండ్ లింక్‌పై క్లిక్ చేసి బ్యాంక్ వివరాలు నమోదు చేయాలి. ఇక మరోవైపు.. రద్దైన నీట్ యూజీ 2026 పునః పరీక్షను జూన్ 21న తిరిగి నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. ఇప్పటికే నమోదు చేసుకున్న విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, అదనపు పరీక్ష ఫీజు కూడా ఉండదని స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా లక్నో వేదికగా పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో 12 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ ఓటమి పాలైతే సెమీఫైనల్ చేరుకునే అవకాశం కోల్పోతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ITBP)కు చెందిన మహిళా బృందం మొట్టమొదటిగా అంతర్జాతీయ మౌంట్ ఎవరెస్ట్ పర్వతారోహణ యాత్రను విజయవంతంగా పూర్తి చేసింది. 11 మంది మహిళా పర్వతారోహకులు, ముగ్గురు సాంకేతిక, సహాయక సిబ్బందితో కూడిన 14 మంది సభ్యుల బృందం ఈ నెల 21న నేపాల్ నుండి సౌత్ కోల్ మార్గం ద్వారా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిందని ITBP ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

మధ్య భారతదేశంలో రాబోయే వారం రోజుల పాటు తీవ్ర వడగాలులు పరిస్థితులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఆగ్నేయ రాష్ట్రాలలో ఈనెల 26వ తేదీ వరకూ అలాగే వాయువ్య భారతదేశంలో 29 వరకూ ఇవే పరిస్థితులు కొనసాగుతాయని వెల్లడించింది. అదే విధంగా పశ్చిమ హిమాలయ ప్రాంతంలో 4 నుండి 6 డిగ్రీల సెల్సియస్, దక్షిణ భారతదేశంలో 2 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఇక రాబోయే 3 - 4 రోజులలో నైరుతి రుతుపవనాలు నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =